క్లుప్తంగా

ప్రసన్న వేంకటేశ్వరుడికి పాయస నివేదన

వేడుకగా కూడార్తై ఉత్సవం


స్వామికి నివేదించిన పాయసం

అక్కిరెడ్డిపాలెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బిల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో కూడార్తై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామికి 127 చిన్న గంగాళాల్లో పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గండ్రెడ్డి రామునాయుడు, సభ్యులు పెట్ల అప్పారావు, శాంతి కుమారి, ఎక్స్ అఫీషియో మెంబర్ నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా నీరాటోత్సవాలు


ఉక్కు వెంకన్న ఆలయంలో పూజలు చేస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నీరాటోత్సవాలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవికి పంచామృత అభిషేకాలు చేశారు. వేకువజామున స్వామికి ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్య నేతృత్వంలో విశేష అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి విధుల్లోకి పారిశుధ్య సిబ్బంది


కార్మికులతో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు అప్పారావు

గాజువాక: జీవీఎంసీ జోన్–6 జోనల్ కార్యాలయం పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు శుక్రవారం నుంచి విధులకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ గత నెల 26 నుంచి ఈ నెల 11 వరకు పారిశుధ్య కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఫలించడంతో సమ్మెకు విరామం ప్రకటించామని చెప్పారు.

'వికసిత్ భారత్' క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నోడల్ అధికారి తారక ప్రసాద్

గాజువాక: అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కేంద్ర సమాచార ప్రసారశాఖ నోడల్ అధికారి తారక ప్రసాద్ అన్నారు. 66వ వార్డులో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర పథకాలను వివరించే క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టి.హెన్రీ, దల్బీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ 'ఆరోగ్య సురక్ష'

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన
- 643 మందికి వైద్యసేవలు


శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


రోగికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది


మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది


కంటి పరీక్షలు చేస్తూ..

పెదగంట్యాడ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు యాతపాలెం సచివాలయ పరిధిలోని గంగవరం యూపీహెచ్‌సీలో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న దృఢ సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలందరికీ మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించి ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారన్నారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆధునిక యంత్రాలతో పాటు స్పెషలిస్టు వైద్యులను సైతం ఇళ్ల వద్దకే తీసుకొచ్చి పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు అందజేస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత వైద్యశిబిరాలకు విశేష స్పందన లభించిందన్నారు. ఇంటికి చేరువలో నిర్వహించిన వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఇప్పుడు నిర్వహిస్తున్న రెండో విడత శిబిరాలను ఉపయోగించుకుని, వైద్యుల సూచనలు పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు.

ఆరుగురు వైద్యులు

శిబిరానికి హాజరైన 643 మందికి ఆరుగురు వైద్యులు సేవలు అందించారు. గంగవరం యూపీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్, చర్మవ్యాధి నిపుణురాలు పి.మహాలక్ష్మి, గైనకాలజిస్ట్ పావని, జనరల్ ఫిజీషియన్ సుస్మిత, మానస తదితరులు రోగులను పరీక్షించి, మందులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు, మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, జోన్–6 జోనల్ కమిషనర్ పి. సింహాచలం, డీఐవో జీవన్‌రాణి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ సంపంగి పార్వతి, సంపంగి ఈశ్వరరావు, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి భరోసా



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మా ఆరోగ్యానికి భరోసా కల్పించారు. చిన్నపాటి వైద్యం కూడా చేయించుకోలేని మాలాంటి నిరుపేదలకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది. అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. దగ్గరలోనే ఇలాంటి శిబిరం నిర్వహించడంతో దూరం వెళ్లే భారం తప్పింది.

– సంపంగి పైడమ్మ, యాతపాలెం

మా గ్రామానికే వైద్యులు వస్తున్నారు



గతంలో ఒంట్లో బాగా లేకపోతే గంగవరం గ్రామంలో ఉన్న యూపీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేది. పెద్ద ఆరోగ్య సమస్య అయితే కేజీహెచ్‌కు పరుగులు తీసేవాళ్లం. ఉదయం వెళ్తే సాయంత్రం వరకు అక్కడే ఉండిపోవాల్సి వచ్చేది. కానీ మా జగన్‌బాబు దయ వల్ల మా గ్రామానికి వైద్యులు వచ్చి ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఇలాంటి సేవలు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను.

– ఎస్.సూర్య, యాతపాలెం

కంటి పరీక్షలు చేశారు



నాకు చూపు సరిగ్గా లేకపోవడంతో కంటి పరీక్షల కోసం వచ్చాను. వైద్యులు బాగా పరీక్షించారు. మందులు, కంట్లో వేసుకోవడానికి డ్రాప్స్ ఇచ్చారు. కంటి అద్దాలు కూడా ఇస్తామన్నారు. ఇలా చేరువలో సేవలు అందడం మా అదృష్టంగా భావిస్తున్నాం.

– పితాని అప్పయ్యమ్మ, అశోక్‌నగర్

తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం


తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున

- ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో ఆధునికీకరణ
- ప్రారంభించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున

గాజువాక: ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో గాజువాక తహసీల్దార్ కార్యాలయాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాక మండల తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక వసతులతో కార్యాలయం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు.

సమష్టి కృషితో అభివృద్ధి ఫలాలు: కలెక్టర్

అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి ఉంటే అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వసతులు కల్పించాలని స్థానిక అధికారులు కోరడంతో వెంటనే రూ.5లక్షలు మంజూరు చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ నిధులకు తోడు స్థానిక దాతలు కూడా సహకారం అందించడం హర్షణీయమన్నారు. కార్యాలయ ఆధునికీకరణలో తహసీల్దార్ శ్రీవల్లి చొరవ ప్రశంసనీయన్నారు. ఈ వేదిక నుంచి ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలు అందజేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. రానున్న ఎన్నికలకు అందరూ అప్రమత్తంగా ఉండాలని, మంచి పనితీరు కనబర్చాలని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీవల్లిని ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పెదగంట్యాడ తహసీల్దార్ రమాదేవి, జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఉక్కు మహిళలు


రికార్డ్ సాధించిన మహిళలతో స్టీల్‌ప్లాంట్ సీజీఎం ప్రకాశ్

ఉక్కునగరం: యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఉక్కునగరం మహిళలు స్థానం సాధించారు. యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న నగరంలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా నిర్వహించిన యోగాసన పోటీల్లో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది పాల్గొన్నారు. ఉక్కు స్టేడియంలోని యోగా అభ్యాసకులు వెంకట శ్యామల, ఎస్.విజయలక్ష్మి, బి.ఉమాదేవి సూర్య నమస్కారాల విభాగంలో పాల్గొన్నారు. వీరు ముగ్గురూ 216 రౌండ్లను 88 నిమిషాల్లో పూర్తి చేసి వరల్డ్ రికార్డ్ బుక్‌లో స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఉక్కు స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, ఎస్.విజయలక్ష్మి, బి.ఉమాదేవిలను అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం అధికారి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా..

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన
- అర్హతే ప్రాతిపదికగా అందరికీ సంక్షేమ ఫలాలు
- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు


వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల కరపత్రం అందిస్తున్న ఉరుకూటి చందు

కూర్మన్నపాలెం: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆర్థిక ఇబ్బందులను తొలగించి సంక్షేమ పాలన అందించాలన్న దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు గణేష్‌నగర్ సచివాలయ పరిధిలో గణేష్‌నగర్, ముసీంవీధి, మీసేవ, ఆర్యవైశ్య వీధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉరుకూటి చందు పాదయాత్ర చేశారు. గడపగడపకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంతృప్త స్థాయిలో అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, ఎన్నేటి కనకరావు, వడ్లపూడి ఈశ్వరరావు, సీరపు పాపారావు, కోటి రెడ్డి, పట్నాన అప్పారావు, కర్రి అప్పారావు, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి మృతి


మృతి చెందిన శంకర్రావు

పరవాడ: దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన వద్ద ఓ వ్యక్తి మృతి చెందిన విషయాన్ని గురువారం పరవాడ పోలీసులు కనుగొన్నారు. మృతుడు స్టీల్ ప్లాంటు ఉద్యోగి ఎం.శంకర్రావు (52)గా గుర్తించారు. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న శంకర్రావు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై దేశపాత్రునిపాలెం వస్తుండగా రైల్వే వంతెన వద్ద గోతిలో వాహనం బోల్తా పడింది. ఆ సమయంలో స్థానికంగా ఎవరు అందుబాటులో లేని కారణంగా శంకర్రావు రాత్రింతా అక్కడే గాయాలతో ఇబ్బంది పడ్డాడు. ప్రమాదంలో శంకర్రావుకు కుడి చేయి విరిగిపోయి ముఖానికి గాయాలయ్యాయి. వంతెన వద్ద గల దుకాణదారులు గురువారం ఉదయం వచ్చి చూడగా కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి సపర్యలు చేశారు. నీళ్లు తాగిన మరుక్షణమే మృతి చెందాడని పోలీసులు చెప్పారు. సమాచారాన్ని అందుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేష్ చెప్పారు.

మానవహక్కులపై అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంఈవో శైలజ

అగనంపూడి: మానవ హక్కులపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలని పరవాడ మండల విద్యాశాఖాధికారి గొంతిన సాయి శైలజ అన్నారు. 79వ వార్డు లంకెలపాలెంలో గురువారం నిర్వహించిన ప్రపంచ మానవ హక్కుల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగితే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాలన్నారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ కాసుల కోనయ్య మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా మానవ హక్కులపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, మహిళా మండలి నాయకురాలు రమాదేవి, వివిధ ప్రజా సంఘాల నాయకులు దాసరి వెంకట జయలక్ష్మి, మోటూరి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, గుడే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

ఆకట్టుకున్న రంగవల్లులు


గాజువాకలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఉరుకూటి చందు


నెల్లిముక్కులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉరుకూటి చందు

పెదగంట్యాడ: పండగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో నెల్లిముక్కు రామాయలం వద్ద ఉరుకూటి చందు ఆధ్వర్యంలో గురువారం జగనన్న సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ అనగానే నెల రోజుల ముందు నుంచే ఇళ్ల ముందు రంగవల్లికలు స్వాగతం పలుకుతాయన్నారు. ముందు నుంచే పండగ వాతావరణం ఉంటుందన్నారు. భావితరాలకు మన ఆచార వ్యవహారాలను చాటిచెప్పేలా పండగలు జరుపుకోవడం అభినందనీయమన్నారు.

విజేతలకు బహుమతులు

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని వెంపాడ గుణలక్ష్మి సొంతం చేసుకోగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో పాల సంధ్యారాణి, కె.లక్ష్మి నిలిచారు. కార్యక్రమంలో నాయకులు గొందేశి శ్రీనివాసరెడ్డి, కొయ్య భారతి, ఉరుకూటి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో..

జీవీఎంసీ పరిధి 70వ వార్డు ద్రోణంరాజు కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగుల రంగవల్లికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అచ్చిబాబు, బాబులునాయుడు, కొణతాల రాము తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్థానిక అరబిందో ఐడియల్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. హరిదాసు, గంగిరెద్దుల వారు, బుడబుక్కల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. విద్యార్థులకు భోగిపళ్లు పోశారు


అరబిందో పాఠశాలలో భోగిపళ్ల వేడుక


గాజువాకలో ఆకట్టుకున్న రంగవల్లిక

విశాఖ ఉక్కుపై కేంద్రం చిన్నచూపు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వ పెద్దలు చిన్నచూపు చూడటం తగదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు పట్టు వదలక నిద్రాహారాలు మాని పోరాటం చేస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1064వ రోజు, గురువారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని, పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మెట్ల మీద నుంచి జారిపడి కాంట్రాక్ట్ కార్మికుడి మృతి


రవికుమార్ మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో మెట్లు దిగుతుండగా జారిన ప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. పార్వతీపురానికి చెందిన వి.రవికుమార్ (46) కుటుంబంతో పెదగంట్యాడలో నివసిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో పని చేస్తున్న రవికుమార్ గురువారం విభాగంలోని ఎయిర్ కంప్రెషర్ ప్లాంట్‌లో ఎత్తులో పని చేసి దిగి వస్తుండగా కాలు జారి కింద పడిపోయారు. గాయపడిన ఆయన, పక్కన ఉన్న స్విచ్ గేర్ రూమ్‌లోకి వెళ్లి పడుకున్నారు. కొద్దిసేపటి తర్వాత సహ కార్మికులు వెళ్లి చూడగా, నోట్లోంచి నొంగ, రక్తం వస్తూ స్పృహ లేకుండా పడి ఉన్నారు. వెంటనే అంబులెన్స్‌లో మెయిన్ గేటు వద్ద ఉన్న ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సమాచారం తెలిసిన స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించనున్నట్లు చెప్పారు. ఎస్‌ఐ సిహెచ్.వి.మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గనుల లీజుల పునరుద్ధరణకు సహకరించండి

కలెక్టర్‌కు నాయకుల వినతి


కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన మాంగనీసు, క్వార్ట్జ్, ఇసుక గనుల లీజుల పునరుద్ధరణకు సహకరించాలని స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నేతృత్వంలో వారు కలెక్టర్ మల్లికార్జునను గురువారం కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన మాంగనీసు కోసం విజయనగరం జిల్లాలోని గర్భాం గనులు, ఇసుక కోసం సారిపల్లి గనులను రాష్ట్ర ప్రభుత్వం లీజుకు ఇచ్చిందన్నారు. ఆ లీజుల కాల పరిమితి ముగియడంతో పునరుద్ధరణ కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దరఖాస్తు చేసిందని తెలిపారు. వాటిని పునరుద్ధరించక పోవడంతో బయట ధరలకు కొనుగోలు చేయడం స్టీల్‌ప్లాంట్‌కు భారంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లీజును పునరుద్ధరించేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి, డి.వి.రమణారెడ్డి, జె.రామకృష్ణ, బి.డేవిడ్, సన్యాసిరావు, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి మార్గదర్శకాలు మాస్టర్ ఈకే గ్రంథాలు

మహారాణిపేట : అంతర్జాతీయ ఆధ్యాత్మిక, సేవా సంస్థ జగద్గురుపీఠం ఆధ్వర్యంలో అంకోసా ఫంక్షన్ హాలులో గురువారం 63వ మాస్టర్ సీవీవీ గురుపూజా ఉత్సవాలలో మాస్టర్ ఈకే గ్రంథాలు ఆవిష్కరించారు. ఆయన రచించిన స్పిరిట్యువల్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అనే గ్రంథాన్ని కులపతి బుక్ ట్రస్ట్ చైర్మన్ సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు, మాస్టర్స్ అండ్ డిసేబుల్స్ అనే పుస్తకాన్ని చిన్మయ మిషన్ నిర్వాహకులు స్వామి చిద్రూపానంద, సుపర్ణ అనే పుస్తకాన్ని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఆవిష్కరించారు. జగద్గురు పీఠం జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.వి.ఎస్ మూర్తి దంపతులు చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. సంగీత జనకులం విద్యార్థులు చేసిన బృందగానం హృద్యంగా సాగింది. మాస్టర్ ఈకేకు నీరాజనంతో మొదటి రోజు గురుపూజోత్సవాలు ముగిసాయి.

భక్తులకు అయోధ్య అక్షింతల అందజేత

అగనంపూడి: అయోధ్య రామాలయం నుంచి తీసుకువచ్చిన అక్షింతలను భక్తులకు అందజేశారు. అగనంపూడి షిర్డీ సాయిబాబా మందిరంలో పూజలు చేసిన అనంతరం వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.రమణారెడ్డి, డి.వ్యాసశర్మ, పి.రామారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు నిత్యావసర సరకులు


మృతుని కుటుంబానికి సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడికి చెందిన రెండు కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులు అందించింది. దొంకాడ ఎస్సీ కాలనీకి చెందిన క్షతగాత్రురాలి కుటుంబానికి, గుల్లవానిపాలేనికి చెందిన మృతుని కుటుంబానికి వీటిని అందించారు. కార్యక్రమంలో విందుల కరుణాకరరావు, అప్పలనాయుడు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన జీవీఎంసీ కాంట్రాక్ట్ కార్మికురాలు వంకర రాణి కుటుంబానికి అగనంపూడికి చెందిన పద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో నెలకు సరిపడా బియ్యం, ఇతర వంట సామాగ్రి అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొలిపాక అప్పారావు, దొడ్డి దేముడు తదితరులు పాల్గొన్నారు.